# గోరాబిచ్చు

రీసెస్ అవర్ కోసం, అప్పుడే స్కూలు వదిలిపెట్టారు. కొంత మంది పిల్లలు స్కూల్ కాంపౌండులో ఆడుకుంటుంటే, మరి కొంతమంది పిల్లలు బయట రోడ్డుమీదకు వచ్చి వేరుశెనగ పప్పులు బిస్కెట్లు, చాక్లెట్లు, బిళ్ళలు మొదలైనవి కొనుక్కుంటున్నారు. అది కేవలం అప్పర్ ప్రైమరీ స్కూల్. అంతా చిన్న పిల్లలు కావడంతో కోలాహలంగా అల్లరి చేస్తున్నారు.

రోడ్డుమీద ఐస్‌ఫ్రూట్ బండి దగ్గర అయిదారుగురు పిల్లలు చేరి ఐస్‌ఫ్రూట్ కొనుక్కుంటున్నారు. ఇంతలో ఆ పిల్లల్లో ఒక్కడ 'ఒరేయ్ గోరాబిచ్చు' అని అరిచాడు. వెంటనే మిగిలిన వాళ్ళుకూడా అటువంక చూస్తూ 'గోరాబిచ్చు, గోరాబిచ్చు' అని అరవసాగారు.

రోడ్డుమీద కొంచెం దూరంలో ఒక పదేళ్ళ పిల్లవాడు పోతున్నాడు. వాడికి ఒళ్ళంతా బొల్లే. జుట్టు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు కూడా తెల్లగా ఉన్నాయి. అకస్మాత్తుగా వాడిని చూస్తే చిన్నపిల్లలు ఝడుసుకుంటారు కూడా. అంతటి అనాకారంగా, భయంకరంగా ఉన్నాడు ఆ పిల్లవాడు. వాడిని చూసే ఆ పిల్లలు, 'గోరాబిచ్చు' అని అరుస్తున్నారు. ఆ మాటకి అర్థం 'తెల్లతేలు' అని.

పిల్లలు 'గోరాబిచ్చు' అని అరుస్తుంటే వాళ్ళవంక కోపంగా చూసి ముందుకి సాగాడు ఆ పిల్లవాడు. పిల్లలు అరుచుకుంటూ వాడివెంట పడ్డారు.

పిల్లలు వెంటపడేసరికి ఆ కుర్రవాడికి సహనం నశించింది. నోటికొచ్చినట్లు తిట్టడం మొదలు పెట్టాడు. దాంతో పిల్లలకి మరింత ఉత్సాహం వచ్చి 'గోరాబిచ్చు' అంటూ అరుస్తూ వెంటపడ్డారు.

పాపం. ఆ కుర్రాడికి ఉడుకుమోతుతనం పరాకాష్ట నందుకుంది. గట్టిగా తిట్టూ, రోడ్డుమీదనుంచి రాళ్ళు తీసి వాళ్ళమీద విసరడం మొదలుపెట్టాడు. దాంతో పిల్లలు అరుపులు మానకుండానే వెనుదిరిగి పరుగు లంకించుకున్నారు. ఇంతలో రీసెస్ అయిపోయి స్కూల్‌గంట మ్రోగటంతో పిల్లలు తిరిగి స్కూలుకి వెళ్ళిపోయారు. బ్రతకుజీవుడా అంటూ, ముందుకి సాగిపోయాడు గోరాబిచ్చు.

## 2

ఆ ఊరిలో నరసింహ చిన్న కొట్టు పెట్టి బట్టల వ్యాపారం చేస్తుండేవాడు. అవి టెర్లిన్ బట్టలు కొత్తగా దేశంలో దిగుమతి అయిన రోజులు. ఆ రోజుల్లో అవి చాలా ఖరీదుగా ఉండేవి. అందువల్ల బాగా డబ్బున్న వ్యాపారస్తులు మాత్రమే వాటిని తెప్పించి అమ్ముతుండేవారు. కొత్త వింత కాబట్టి, అవి ఖరీదు ఎక్కువైనా ప్రజలకి వాటిమీద మోజు బాగా వుంది వేలంవెర్రిగా కొనేవారు. టెర్లిన్ బట్టల పోటీవల్ల నూలు బట్టల వ్యాపారం చేసే చిన్న వ్యాపారస్థులు చాలామంది దెబ్బతిన్నారు. విపరీతంగా నష్టపోయిన వాళ్ళలో నరసింహ ఒకడు. ఆ దిగులుతోనే అతను మంచంపట్టి కొద్ది నెలల్లోనే భార్యనీ,

ఎనిమిది సంవత్సరాల కొడుకునీ, ఐదేళ్ళ కూతుర్నీ ఈ లోకంలో వదిలి వెళ్ళిపోయాడు. అప్పటితో ఆ సంసారం పరిస్థితి తెగిన గాలిపటం అయింది. నరసింహ భార్య పోచమ్మ చాలా వోర్పుగలది. ఉన్నది తెగనమ్మి ఎలాగోలాగ రెండేళ్ళు సంసారాన్ని ఈడ్చుకొచ్చింది. కాని ఏ ఆధారం లేకుండా ఎన్నాళ్ళు సంసారం గడుస్తుంది? పిల్లలకి చదువు చెప్పించే స్తోమత ఎలాగూలేదు. అందువల్ల గౌరవ కుటుంబంలో పుట్టినా, తప్పనిసరి అయి, నాలుగిళ్ళల్లో అంట్లు తోమడానికీ, బట్టలు ఉతకడానికీ ఒప్పుకుంది. కాని అదిమాత్రం ఏమి సరిపోతుంది? పిల్లని తనవెంట తిప్పుకుంటూ, ఒక్కగానొక్క కొడుకు రాజుని కమ్మరి కొలిమిలో పని పిల్లవాడుగా కుదిర్చింది.

నరసింహ బ్రతికి ఉన్న రోజుల్లో, పోచమ్మ, రాజు భవిష్యత్తును గురించి ఎన్నో కలలు కనేది. వాడికి మంచి చదువు చెప్పించాలని, పెద్ద ఉద్యోగం రావాలని అనుకుంటూ ఉండేది. కాని ఆ ఆలోచనల వెంట ఆమెకి పెద్ద దిగులుకూడా ఉండేది. రాజు పుట్టడమే బొల్లిపిల్లవాడిగా పుట్టాడు. పోచమ్మ మేనమామకి ఆ వ్యాధి ఉండేది. మేనమామ పోలిక తనకి రాకపోయినా, తన కుమారునికి వచ్చినట్లుందని బాధపడేది. ఒళ్ళూ, జుట్టూ అంతా కూడా తెల్లగా ఉంది చాలా వికృతంగా ఉండేవాడు రాజు. ఆ పిల్లవాడిని గురించి ఎవరైనా వ్యంగ్యంగా మాట్లడితే, ఆ బాధ భరించలేక, పైకి ఏమీ అనలేక "మావాడి కేమమ్మా దొరబాబు అని కళ్ళనీరు పెట్టుకునేది. నరసింహ, పోచమ్మ, రాజు బొల్లి కుదర్చడం కోసం ఎన్నో వైద్యాలు చేయించారు. ఎంతో డబ్బు ఖర్చు పెట్టారు. కాని అందరూ అనిందేమిటంటే "ఇది ప్రమాదం లేని చర్మవ్యాధి. అంటువ్యాధి కాదు. దీనిని పూర్తిగా కుదర్చడానికి మాత్రం ఏ మందులూ లేవు" అని. అంతటితో ఆ దంపతులు పూర్తి నిరాశ చెందారు. నరసింహ బ్రతికి ఉంటే తన ప్రయత్నాలు ఇంకా కొనసాగించేవాడేమో! కాని అతను పోవడంతో, పోచమ్మ ఇంక ఏ ప్రయత్నమూ చేయలేదు. చేద్దామన్నా అవకాశం ఉంటేకదా!

రాజుకీ తన దేహం చూస్తుంటే ఎంతో అసహ్యం వేసేది. ఎవరి దగ్గరికి వెళ్ళాలన్నా ఎవరితో మాట్లాడాలన్నా, ఎంతో బిడియపడేవాడు. ఏదో తప్పు చేసినట్లుగా తల వంచుకునేవాడు. పుట్టాడు కనుక పెరగాలి. సంఘంలో ఉన్నాడు కనుక సంఘజీవిగా బ్రతకాలి. తాను క్రాస్తో కూస్తో తల్లికి సహాయంగా ఉంటున్నందుకు సంతోషపడేవాడు ఆ పసివాడు.

బొల్లి ఒళ్ళున్న రాజుకి పని దొరకడమే పెద్ద కష్టమయింది. మామూలుగా అయితే ఎక్కడో అక్కడ ఏదో ఒక చిన్నపని దొరికేది. కాని బొల్లివాడవడంతో, అతన్ని పెట్టుకోడానికి ఎవరూ ఇష్టపడలేదు. చివరికి ఎలాగైతేనేం ఆ ఇనప కొలిమిలో పని దొరికింది. కాని పరిస్థితుల బలహీనతను స్వార్థానికి ఉపయోగించుకున్నాడు ఆ యజమాని. అంతవరకూ ముప్ఫయి రూపాయలిచ్చి పని చేయించుకుంటున్న ఒక కుర్రవాణ్ణి ఏదో కుంటిసాకుతో పనిలోంచి తీసివేశాడు. రాజు బొల్లివాడు కనుక ఇరవై రూపాయలిచ్చి, పనిలో పెట్టుకోడానికి ఒప్పుకున్నాడు. ఆ పనిని ఎంతో జాలితో, దయతో ఇస్తున్నట్లు నటించాడు. రాజుకి ఉన్న బొల్లి, మామూలుగా ఇచ్చే జీతం ఇయ్యడానికి పనికిరాలేదు. కాని, రెట్టింపు పని చేయించుకోడానికి పనికి వచ్చింది. 'మతిలేనమ్మకి గతిలేని మొగుడు' అన్నట్లు, అదే మహాప్రసాదంగా భావించి రాజుని పనిలో కుదిర్చింది పోచమ్మ.

రాజు పనిలో జేరి వారం రోజులు అయింది. రాజు యజమానికి ఎప్పుడూ ముక్కుమీద ఉంటుంది కోపం. చీటికి మాటకి, తన దగ్గర ఉన్న పనివాళ్ళని నోటికొచ్చినట్లు తిట్టుంటాడు. చిన్నపిల్లల్ని జుట్టు పట్టుకొని, ఎముకలు విరిగేలాగా కొట్టుంటాడు. పిడిగుద్దులు గుద్దుతూ ఉంటాడు. ఆ వాతావరణం చూసి మొదటిరోజున వణికిపోయాడు రాజు. అందరితోపాటు రాజుకీ తిట్లవడ్డన ఘనంగానే

వడ్డించేవాడు యజమాని. అయితే రాజుకి మరి కాసిని ఎక్కువ పెట్టేవాడు! బొల్లి ఉండడమే మహానేరం అన్నట్లు ఆ మాటకు ముందు 'బొల్లి వెధవా' అంటూ నానా రకాలుగా తిట్టేవాడు. సుగుణ మేమిటంటే, మిగిలిన పిల్లలతోపాటు రాజుని కొట్టేవాడు కాదు. అది ఆ అభాగ్యుడి మీద పుట్టిన జాలివల్ల కాదు రాజుకి ఉన్న బొల్లి ఇచ్చిన వరం. బొల్లి వాడైనందువల్ల, వాడిని ముట్టుకోడానికి అసహ్యం. ముట్టుకుంటే తనకీ ఆ వ్యాధి అంటుకుంటుందేమోనని భయం. కాని తక్కువ జీతానికి వాడిచేత చేయించుకోడానికి ఈ సంకోచాలేమీ అడ్డురావు.

రాజు పనికి కుదిరిన మూడో రోజున ఆ స్కూలు పిల్లల కంటపడ్డాడు. ఆ పిల్లలలో ఒకడు రాజుని చూపించి "ఒరేయ్ ఎంత తెల్లగా ఉన్నాడురా!" అని అన్నాడు. ఇంకోడు "అవునురా ఇంగ్లీషు వాళ్ల పిల్లవాడేమో!" అన్నాడు. మరొకడు "నీముఖం వాడు బొల్లివాడురా. మా ఇంటికి దగ్గర్లో కూడా ఇటువంటి వాడున్నాడు". "వాడిని 'తెల్లతేలు' అని పిలుస్తుంటాం" అన్నాడు. "తెల్లతేలు. అచ్చా గోరాబిచ్చు" అన్నాడు ఒక మహమ్మదీయ బాలుడు.

"బాగుందిరా గోరాబిచ్చూ" అన్నారు మిగిలిన పిల్లలు. అంతటితో రాజుకి 'గోరాబిచ్చు' అని నూత్న నామకరణం జరిగిపోయింది. ఆ తర్వాత రాజు కనిపించినప్పుడల్లా, 'గోరాబిచ్చూ!' అని ఏడిపించడం మొదలు పెట్టారు ఆ పిల్లలు.

రాజు వాళ్ళ మాటల్ని ఒకటి రెండు రోజులు పట్టించుకోలేదు. ఆ తర్వాత తిట్టుకుంటూ, తన దారిన పోవడం మొదలు పెట్టాడు. ఇంకా ఎక్కువ అయ్యేసరికి, సహించలేక, తిరగబడి రాళ్ళు వేయడం మొదలు పెట్టాడు. తన సాటిపిల్లలు, తన కంటే చిన్న పిల్లలు తనని నిష్కారణంగా ఉడికించి ఏడిపిస్తుంటే, ఆవేదనని భరించలేకపోయాడు ఆ పసివాడు.

## 3

రోజురోజుకీ రాజుని పిల్లలు ఏడిపించటం ఎక్కువైపోతోంది. పోనీ ఏదో కొద్దిమంది అనుకుంటే, కొత్తగా కొత్తవాళ్ళు కూడా రోజూ చేరి ఏడ్పిస్తున్నారు. వీధిలోకి అడుగు పెట్టడం అంటేనే 'కబేళా' కి పోయే పశువులలాగా, భయపడి పోసాగాడు రాజు. ఎన్నాళ్ళు ఈ చిత్రహింస? ఎంత కాలం భరించడం!

ఆరోజు, రాజుని పిల్లలు మరీ ఎక్కువగా 'గోరాబిచ్చూ' అంటూ ఏడ్పించసాగారు. ఆ బాధ తట్టుకోలేక, రాజు ఏడుస్తూ, వాళ్ళని తిట్టూ, ఆ పిల్లలమీద రాళ్ళు రువ్వసాగాడు. మామూలుగా అయితే వాడు రాయివేయగానే పిల్లలు పారిపోయేవారు. కాని ఆరోజు, పిల్లలలో ఒకడికి కొత్త ఆలోచన తట్టింది. రాజు రాయితీయగానే, వాడు కూడా రాయితీసి 'గోరాబిచ్చూ' అంటూ వాడిమీదకి విసిరాడు. వాడిని చూసి మిగిలిన పిల్లలు కూడా రాళ్ళు తీసి విసరడం మొదలుపెట్టారు.

రాజైతే ఒక్కడు. వాళ్ళైతే ఎందరో ఉన్నారు. వాళ్ళంతా కలిసి తనమీద రాళ్ళు వేస్తుంటే ఒంటరివాడు ఏమి చేయగలడు? అందుకని ఈ పరిణామానికి విస్తుపోయి, నిలుచుండిపోయాడు రాజు. పిల్లలు వేసిన రాయి ఒకటి కాలికి తగలడంతో, తిరిగి ఈ లోకంలోకి వచ్చాడు. చేసేది లేక ఏడ్చుకుంటూ వాళ్ళని తిట్టుకుంటూ, పరుగెత్తుకు వెళ్ళిపోయాడు. రాళ్ళు తీసుకుని కొంచెం దూరం వెంటాడి, తిరిగి సూల్లోకి వెళ్ళిపోయారు పిల్లలు. రాజుని ఏడిపిస్తుంటే వాళ్ళకి ఏనుగెక్కినంత ఆనందంగా ఉంది. దారినపోతున్న పెద్దలు 'ఇదేమిటి?' అన్నవారు లేడు సరికదా, ఆ వింత చూసి నవ్వుకున్నారు.

ఆ రోజు ఇంటికి వెళ్లాక, తల్లిముందు జరిగిందంతా చెప్తూ భోరున వెక్కివెక్కి ఏడ్చాడు రాజు.

తాను ఎందులోనైనా దూకి చచ్చిపోతానని గోలపెట్టాడు.

కొడుకుకి జరిగిన అన్యాయానికి పోచమ్మ మనసు ఎంతో బాధపడింది. కాని ఆమె ఏమి చేయగలదు? లోకం నోటిని అందులో చిన్నపిల్లల్ని ఎవరు వారించగలరు? కొడుకు దీనావస్థకి ఆమె కళ్లలో నీరు తిరిగింది.

"చూడు బాబూ .... మనం వద్దంటే వాళ్ళు మానరు. వద్దన్నకొద్దీ మరీ ఏడిపిస్తారు. అడిగితే వాడిని మరింత ఉడికిస్తారు. ఏడ్చేవాడిని ఇంకా ఎక్కువగా ఏడిపిస్తారు. అందుచేత వాళ్ళు నిన్నేమి అన్నా, నిన్ను కాదన్నట్లు ఊరుకో. ఏనుగు పోతుంటే - కుక్కలు మొరుగుతుంటాయి. అయినా అది ఏమీ లెక్కచేయక తన దారి వెంట అది వెడుతుంది. నీకు ఒళ్ళు బొల్లిదే కావచ్చు కాని మనస్సు స్వచ్ఛం. వాళ్ళకు ఒళ్ళు బాగా ఉన్నా మనసు బొల్లిది" అని ఊరడించింది.

"పదిమందీ కలిసి ఏడిపిస్తుంటే ఎలాగమ్మా ఊరుకోవడం?" అంటూ ఏడుస్తూనే అడిగాడు రాజు.

"తప్పదు బాబూ తప్పదు. ఓర్చుకోక తప్పదు. వాళ్ళేమంటున్నా నువ్వు చిరునవ్వు నవ్వు. అయినా, నిన్నుచూసి వాళ్ళు ఆనందపడ్తున్నారంటే, అందుకు నువ్వు సంతోషించాలి. నువ్వు బాధపడుతూ వాళ్ళని ఆనందంపెడుతుండడం ఎంత గొప్ప విషయం బాబూ .... అది అందరికి సాధ్యమవుతుందా? కొవ్వొత్తి చూడు. ఇతరులకి కాంతి ఇస్తూ తాను కరిగిపోతోంది. అదే దాని సార్థకత. నువ్వూ అంతే" అంటూ ఓదార్చింది.

ఏడ్చి ఏడ్చి, అమ్మ ఓదార్పుతో గుండె బరువు తగ్గి నిద్రపోయాడు రాజు.

## 4

మర్నాడు మామూలుగా రాజు పనిలోకి బయల్దేరాడు. స్కూలుని సమీపిస్తుండగానే గుండె దడదడలాడింది. కాని ధైర్యం చిక్కబట్టుకున్నాడు. అనుకున్నట్లుగానే ఒక పిల్లవాడు బిగ్గరగా 'గోరాబిచ్చూ' అని అరిచాడు. రాజుఆగాడు. "అవును బాబూ నేను గోరాబిచ్చునే. అదే నా పేరుగా పెట్టుకుంటున్నాను. నన్నుచూసి మీకంత ఆనందంగా వుంటే నాకెంత సంతోషంగా వుందో తెలుసా? అనండి 'గోరాబిచ్చూ' అనండి. మీతోపాటు నేనూ అంటాను" అంటూ 'గోరాబిచ్చూ, గోరాబిచ్చూ' అని తానూ అనసాగాడు. ఆ క్షణంలో రాజు ముఖంలో కోపం లేదు. ప్రశాంతత తాండవిస్తోంది. చిరునవ్వు నవ్వుతూ నిలబడి వున్నాడు.

రాజు పలుకులు ఆ పిల్లలకి ఆశనిపాతం అయ్యాయి. ఆశ్చర్యంతో ఒకరిముఖం ఒకరు చూసుకోసాగారు. ఎవరూ మాట్లాడలేదు. ఒకరి వెనకాల ఒకరు జారుకోసాగారు! ఇంతలో స్కూల్ గంట మ్రోగడంతో, పిల్లలందరూ పరుగెత్తుకుంటూ స్కూలు లోపలికి వెళ్ళిపోయారు.

అంతే. ఆ రోజునుంచీ మళ్ళీ ఆ స్కూలు పిల్లలు, రాజుని 'గోరాబిచ్చూ' అని అన్నది లేదు. అసలు అతని ఉనికినే పట్టించుకోడం మానేశారు.

తల్లి ఊరడింపుతో తనకి జ్ఞానోదయమై, ఒక మార్గం గోచరించినందుకు, అమ్మకి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు రాజు.

పారిపోతుంటే నీడ వెంటపడుతుంది. ఎదురు తిరిగితే పారిపోతుంది. మనుష్యుల తత్త్వం కూడా ఇంతే!

*(ఆనందజ్యోతి వారపత్రిక 16-6-1979)*